సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం। 4। ఆగస్టు। 2023



సోమశిలలో 24.13 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారానికి 24.13 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 1150, ఉత్తర కాలువకు 240 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,496
మూడు శాతం జీఎస్టీతో..	రూ.5,661
నవర (8 గ్రా)	రూ.45,288

గరిష్టం/కనిష్టం
36.1 /29.7

వాతావరణం

వాతావరణంలో తేమ 49 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం శుక్రవారం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సమష్టి కృషితో పండగ విజయవంతం



మాట్లాడుతున్న కూర్మనాథ్

నెల్లూరు(బారకాసు): అందరి సమష్టి కృషితో రొట్టెల పండగ విజయవంతమైందని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో జేసీ గురువారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ కలెక్టర్ హరినారాయణన్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సమర్థంగా పనిచేసిందని చెప్పారు. ఏర్పాట్లపై ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ సమీక్ష సమావేశాలను నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన దాదాపు 12 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులకు ఏ సమస్యా తలెత్తలేదని పేర్కొన్నారు. అనంతరం నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, తదితరులను సత్కరించారు. అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీపీఓ దేవీకుమారి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, ఎస్‌ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం



మాట్లాడుతున్న సుస్మితారెడ్డి

నెల్లూరు (పొగతోట): జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలతో గురువారం నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దీనికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

ఏఐఎల్‌యూ జిల్లా మహాసభ రేపు

నెల్లూరు (లీగల్): ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) 12వ జిల్లా మహాసభను నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయమోహన్‌రెడ్డి, అంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. సభను జయప్రదం చేయాలని కోరారు.

96.27 శాతం మందికి పింఛన్లు



ఖుద్దూస్‌నగర్‌కు చెందిన జానకికి జీజీహెచ్‌లో నగదును అందజేస్తున్న వలంటీర్ శ్రీకాంత్

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. మూడో రోజు గురువారం నాటికి 96.27 శాతం మంది లబ్ధిదారులకు నగదును అందజేశారు. 3,03,501 మందికి గానూ 2,92,169 మందికి పంపిణీ చేశారు.

పొగాకు రైతు ఖుషీ



జిల్లాలో పొగాకు ధరలు ఈ ఏడాది ఆల్‌టైమ్ రికార్డుకు చేరుకున్నాయి. ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాలు ఒక ఎత్తయితే.. ఎస్‌ఎల్‌ఎస్‌గా పిలిచే పొదిలి, కందుకూరు – 1, 2, కలిగిరి, డీసీపల్లి కేంద్రాల్లో వేలం ప్రారంభం నుంచే రికార్డు స్థాయి ధరలు నమోదయ్యాయి. ఫలితంగా రైతులు ఖుషీఖుషీగా ఉన్నారు.

ఈ ఏడాది ఆల్‌టైమ్ రికార్డుకు ధరలు

- గతంలో అత్యధిక ధర కిలో రూ.179
- ఈ ఏడాది రూ.270
- లాభాలను ఆర్జించిన అన్నదాతలు
- ముగిసిన కొనుగోళ్లు

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): పొగాకు సాగు చేసిన రైతులు ఈ ఏడాది కింగులయ్యారు. ఆల్‌టైమ్ రికార్డుకు చేరిన ధరలతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. పొగాకు సాగు ద్వారా జిల్లాలో 22 మండలాల రైతులు జీవనం సాగిస్తున్నారు. గతంలో బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు చేసి పొగాకు సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించాక అరకొర ఆదాయంతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో పలువురు రైతులు పొగాకు సాగు మానుకొని ప్రత్యామ్నాయ



బేళ్లను తరలించేందుకు సిద్ధంగా లారీలు

పంటల వైపు మళ్లిన ఉదంతాలూ ఉన్నాయి.

తీరిన దశాబ్ద కష్టాలు

ఈ ఏడాది లభించిన ధరలతో దశాబ్దాల కష్టాలు, ఆర్థిక ఇక్కట్లు తొలగిపోతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కిలో పొగాకు రూ.179 అత్యధిక ధర పలకగా, ఈ ఏడాది ఏకంగా వంద రూపాయలు పెరిగి రూ.270గా నమోదైంది. మాడు, పచ్చ, బ్రైట్, వర్జీనియా, తదితర రకాల పొగాకును గతంలో భిన్నమైన ధరలకు కంపెనీల వారు కొనుగోలు చేసేవారు. అయితే ఈ ఏడాది అన్ని రకాల పొగాకుకు సమానమైన ధరలు లభించాయి. ఒక్క డీసీపల్లి వేలం కేంద్రంలోనే 89 రోజుల పాటు నిర్వహించిన వేలంలో 64,846 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. దీని తూకం 83,04,432 కిలోలు కాగా, రైతులకు రూ.173,38,91,865 ధర లభించింది.

రూ.70 వేల వరకు వ్యయం

ఒక్కో ఎకరాలో పంట సాగు నుంచి విక్రయించే వరకు రూ.70 వేల వరకు ఖర్చవుతుందని పొగాకు రైతులు, బోర్డు అధికారులు చెప్తున్నారు. ఒక్కో బ్యారెన్‌కు పొగాకు బోర్డు ఏటా ఎనిమిదెకరాల్లో మాత్రమే పంట సాగుకు అనుమతిస్తోంది. రైతులు అనేక కారణాలతో 15 ఎకరాలకుపైగా సాగు చేస్తున్నారు. పొగాకు విక్రయం ద్వారా ఒక్కో ఎకరాకు ఈ ఏడాది రూ.1.8 లక్షల మేర రైతులకు గిట్టుబాటు ధర లభించిందని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ లెక్కన

వేలం కేంద్రం :	డీసీపల్లి
89 రోజుల్లో కొనుగోలు చేసిన బేళ్లు :	64,846
పొగాకు కిలోల్లో :	83,04,432
లభించిన ధర : దాదాపు	173.38 కోట్లు

15 ఎకరాలు సాగు చేసిన ఒక్కో బ్యారెన్ రైతుకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల నికర ఆదాయం లభించిందని తెలుస్తోంది.

గతంతో పోలిస్తే ఎంతో మిన్నగా..

డీసీపల్లి వేలం కేంద్రంలో కిలో పొగాకు సగటు ధర రూ.208.79గా నమోదు కావడం పొగాకు బోర్డు చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డుగా చెప్పొచ్చు. ఇందులో కిలో వర్జీనియా పొగాకుకు రూ.214.15, మధ్యరకం పొగాకుకు రూ.212.24, లోగ్రేడ్ పొగాకుకు రూ.197.54 చొప్పున నమోదు కావడం మైలురాయిగా నిలిచిపోనుంది.

రికార్డు స్థాయిలో ఐటీసీ కొనుగోళ్లు

2022 – 23 పంట సీజన్ గురువారంతో ముగిసింది. డీసీపల్లి వేలం కేంద్రంలో 46.29 శాతం మేర ఐటీసీ కొనుగోలు చేసి అగ్రగామిగా నిలిచింది. మిగిలిన 12 కంపెనీలు 53.71 శాతం పొగాకును కొనుగోలు చేశాయి. అయితే ఒకేసారి ధరలు పెరగడంతో వచ్చే ఏడాది పొగాకు సాగును అత్యధికంగా చేపట్టేందుకు రైతులు పోటీ పడుతున్నారు. గతేడాది రూ.లక్షగా ఉన్న పొగాకు బ్యారెన్ కౌలు, ఈ ఏడాది రూ.1.5 లక్షలకు పెరిగింది. కాగా మళ్లీ అదే ధరలు దక్కుతాయనే గ్యారెంటీ లేదని.. పొగాకు బోర్డు సూచనలు పాటించి పరిమితంగా పంటను సాగు చేసి లాభాలను ఆర్జించాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు.



డీసీపల్లి వేలం కేంద్రంలో బేళ్ల కొనుగోలు

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం



బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పొగాకును సాగు చేస్తే ఆదాయం అంతంతమాత్రంగా వచ్చేది. ఈ ఏడాది లభించిన పొగాకు ధరలు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కల్పించాయి.

– సంగన సుధాకర్‌రెడ్డి, రైతు, ఖాన్‌సాహెబ్‌పేట, మర్రిపాడు మండలం

మేలు కలిగింది



30 ఏళ్లుగా పొగాకు సాగు చేస్తున్నా. ఏటా పంట సాగు కోసం పెట్టే ఖర్చులు.. ఆదాయం ఒక్కటిగానే ఉండేవి. భారీ నష్టాలు సంభవించిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఏడాది వేలం కేంద్రంలో లభించిన ధరలు గొప్ప మేలు చేశాయి.

– సానా ఓబుల్‌రెడ్డి, రైతు, రామస్వామిపల్లి, ఆత్మకూరు మండలం


కష్టానికి తగిన ప్రతిఫలం



అప్పులు తెచ్చి పంటను సాగుచేసే వాళ్లం. గతంలో పొగాకు ధరలు అంతంతమాత్రంగా ఉండేవి. ఈ ఏడాది రైతులు ఆశించిన విధంగా ధరలు లభించాయి. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది.

– రేవూరు నరసింహారెడ్డి, రైతు, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ



మాట్లాడుతున్న కూర్మనాథ్



హాజరైన అధికారులు

- జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి జేసీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కార్యక్రమం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. ప్రసంగం, స్వాతంత్య్ర సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్‌డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసపత్రాలు, జ్ఞాపికల బహూకరణ, తదితరాలను నిర్వహించనున్నామని వివరించారు. వివిధ శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగుల వివరాలను కలెక్టర్ సూచనలకు అనుగుణంగా ఈ నెల పదిలోపు అందజేయాలని కోరారు. అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఏఎస్పీ శ్రీనివాసరావు, నుడా వీసీ బాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డ్వామా, హౌసింగ్ పీడీలు వెంకట్రావు, నాగరాజు, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో రైతులకు మేలు



ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న అధికారులు

చేజర్ల(సోమశిల): రైతులకు మంచి ఆదాయాన్ని ఆయిల్‌పామ్ సమకూరుస్తుందని జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలంలోని బొమ్మవరం, అగ్రహారంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌ను గురువారం నిర్వహించారు. అగ్రహారంలోని శ్వేత, సుభాషిణి పొలంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 140 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటామని తెలిపారు. దీని సాగు కోసం హెక్టార్‌కు రూ.29 వేల రాయితీని ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. అంతర పంటల సాగు, ఆయిల్‌పామ్ తోటలో ఎరువుల యాజమాన్య ఖర్చులకు గానూ నాలుగేళ్లకు రూ.42 వేల రాయితీని అందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు మాట్లాడారు. ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర పంటలను సాగు చేసే రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేయనున్నామని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి, శాప్ డైరక్టర్ కాలువ నర్సింహులు, జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ఏజీఎం సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం గ్రేడ్ - 2 ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- సిబ్బంది హర్షాతిరేకాలు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు



విద్యుత్ భవన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 572 మంది జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2లను ఇక నుంచి శాశ్వత ఉద్యోగులుగా పరిగణించనున్నారు. గతేడాది జూలై ఒకటి నుంచి వీరిని క్రమబద్ధీకరిస్తున్నట్లు.. అప్పటి నుంచి రావాల్సిన అరియర్స్‌నూ చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్ – 2 ఉద్యోగులుగా వీరు 2019, అక్టోబర్ రెండున విద్యుత్ సంస్థలోకి వచ్చారు. తమను క్రమబద్ధీకరిస్తూ ఆదేశాలు జారీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జేఎల్‌ఎం గ్రేడ్ – 2లు కృతజ్ఞతలను తెలియజేశారు.

థాంక్యూ సీఎం సార్



రెండేళ్ల ప్రొబేషన్ కాలం ముగియడంతో క్రమబద్ధీకరిస్తారని ఎన్నో కలలు గన్నాం. దీన్ని నిజం చేస్తూ మమ్మల్ని విద్యుత్ సంస్థలో శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నరసింహులు, జేఎల్‌ఎం, వెంకటేశ్వరపురం

ఎంతో సంతోషంగా ఉంది



జేఎల్‌ఎం – 2లను విద్యుత్ సంస్థలో విలీనం చేయరంటూ కొందరు అపోహలు సృష్టించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మమ్మల్ని క్రమబద్ధీకరిస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎంతో ఆనందంగా ఉంది.

– కుమార్, జేఎల్‌ఎం, ఈస్ట్ – 1 సెక్షన్

ఆనందాలు నింపారు



జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2గా విధులు నిర్వర్తిస్తున్న మమ్మల్ని విద్యుత్ సంస్థలో విలీనం చేసి మా జీవితాల్లో ఆనందాలు నింపారు. ఈ నిర్ణయంతో మా జీవితాలు మారుతాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– తులసీరామ్, బీవీనగర్ సెక్షన్

16 వరకు ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023 – 24 విద్యా సంవత్సరంలో బీఏ, బీకామ్, బీఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన అడ్మిషన్ల గడువును ఈనెల 16 వరకు పొడిగించారని సర్వోదయ కళాశాల రీజినల్ కోఆర్డినేటర్ పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణులైన వారికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాన్ని కల్పిస్తామన్నారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు 73829 29611 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



భూ యాజమాన్య హక్కు ధ్రువీకరణ కార్డులను పంపిణీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడిలో లబ్ధిదారులకు స్వామిత్వ కార్డులను గురువారం పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం అమలు చేస్తున్నారని కొనియాడారు. ఏళ్ల క్రితం నివాసాలు కట్టుకొని ఎలాంటి హక్కులేని వారికి భూ హక్కు – భూరక్ష పథకం ద్వారా స్వామిత్వ కార్డులను పంపిణీ చేసి హక్కులను కల్పిస్తున్నామని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 3672 మంది లబ్ధిదారులకు హక్కు పత్రాలను మంజూరు చేశామని వివరించారు. సీఎం జనరంజక పాలనను చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్ వలంటీర్ వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోవడంతో నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని తెలిపారు.

దోపిడీలో చంద్రబాబు దిట్ట

చంద్రబాబు పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఏ ఒక్క మంచి పనీ చేయలేదని మంత్రి ధ్వజమెత్తారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ఆయన ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలి దోచుకోవడంపైనే దృష్టి సారించారని విమర్శించారు. మోసాలతో అధికారంలోకి రావాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్.. మరికొన్ని పార్టీలను కలుపుకోవాలని చూస్తున్నారని, అయితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలనే నమ్ముకొని ఎన్నికలకు ఒంటరిగా సిద్ధమవుతున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తే సీఎంకు మంచి పేరొస్తుందనే భయంతో చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా స్థలాలను నియోజకవర్గంలో పంపిణీ చేసి ఇళ్లు కట్టిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా బాలింతలు, గర్భిణులకు సరుకుల కిట్లను మంత్రి పంపిణీ చేశారు. డీపీఓ సుస్మిత, తహసీల్దార్ కృష్ణ, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ ఏడుకొండలు, నేతలు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కుంచె రమేష్, కప్పిర సూరియాదవ్, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

రూ.21 లక్షలు పలికిన పశువుల సంత వేలం



భాస్కర్‌రెడ్డికి సంత హక్కు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

మనుబోలు : మనుబోలు పశువుల సంత హక్కుల కోసం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేలం నిర్వహించారు. మొత్తం 8 మంది ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనగా గ్రామానికి చెందిన ఏలూరు భాస్కర్‌రెడ్డి అత్యధికంగా రూ.21 లక్షలతో హక్కులను దక్కించుకున్నారు. నిబంధనలు అనుసరించి హక్కుదారునికి ఈనెల 9వ తేదీ నుంచి 2024 ఆగస్టు 8వ తేదీ వరకు సంతను నిర్వహించుకోవచ్చని ఈఓపీఆర్డీ ప్రసాద్ తెలిపారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే సగం మొత్తాన్ని పంచాయతీకి చెల్లించారు. మిగిలిన సగాన్ని వారంలోపు చెల్లించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్) : ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వేదాయపాళెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన షేక్ కరీమున్నీసా, అహ్మద్‌బాషా దంపతులు. వారికి షాహీనా, పర్వీన్(18), జావిద్ సంతానం. అహ్మద్‌బాషా పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో కరీమున్నీసా టైలరింగ్ పనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. పెద్ద కుమార్తెకు వివాహం చేసింది. రెండో కుమార్తెను నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో బీసీఏ రెండో సంవత్సరం, కుమారుడిని ఐటీఐ చదివిస్తోంది. పర్వీన్ తండ్రి లేడని నిత్యం బాధపడుతుండేది. తల్లి పడుతున్న కష్టాలను చూసి ఎలాగైనా తొందరగా ఉద్యోగం సాధించి కుటుంబాన్ని చూసుకోవాలని ఆలోచిస్తూ ఉండేది. బుధవారం సాయంత్రం పర్వీన్ ఎప్పటిలానే కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. కరీమున్నీసా చిల్లర సామాన్ల కోసం నగరంలోకి వెళ్లింది. జావీద్ తన పెద్దమ్మ కుమారుడు షాకీర్‌తో కలిసి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో పర్వీన్ బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన జావీద్ బెడ్‌రూమ్ తలుపు తెరిచే ప్రయత్నం చేయగా రాలేదు. తాళం హోల్ నుంచి చూడగా ఫ్యాన్‌కు పర్వీన్ వేలాడుతూ కనిపించింది. దీంతో అతను పెద్దగా కేకలు వేయగా, స్థానికులు అక్కడకు చేరుకుని తలుపులు పగులగొట్టి పర్వీన్‌ను కిందకు దించారు. జరిగిన విషయాన్ని జావీద్ తన తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. ఇంటికి చేరుకున్న కరీమున్నీసా కుమార్తెను హుటాహుటిన జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. ఈ మేరకు తల్లి వేదాయపాళెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్) : పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై అతని స్నేహితుడు హత్యాయత్నం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళేనికి చెందిన శ్రీధర్ గ్రానైట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీధర్‌కు అతని స్నేహితుడు ఖాజాతో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీ ఇరుగాళమ్మ సెంటర్ వద్ద శ్రీధర్ ఉండగా ఖాజా అతనిపై కత్తితో విచక్షణా రహితంగా దాడిచేసి పరారయ్యారు. గాయాలపాలైన శ్రీధర్‌ను స్థానికులు 108 సహాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈమేరకు క్షతగాత్రుడి తల్లి మోహనమ్మ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

చెంతకే సరుకులు

గతంలో రేషన్ కావాలంటే చౌక దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రతినెలా రేషన్ వాహనాల ద్వారా ఇంటింటికీ బియ్యం, ఇతర సరుకులు అందిస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



గోధుమ ప్యాకెట్‌ను అందుకుంటూ..



నెల్లూరు మూలాపేటలో ఇంటి వద్దే రేషన్ అందుకుంటున్న మహిళలు



బియ్యం తీసుకుంటూ..

ఆరు నిమిషాల్లో వచ్చి.. సమస్యను పరిష్కరించి

- దిశ యాప్‌లో వివాహిత ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం : భర్త తనను వేధిస్తున్నాడని ఓ వివాహిత దిశ యాప్‌లో ఫిర్యాదు చేయగా, ఆరు నిమిషాల్లో వారు ఆమె వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరించారు. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన నజీర్ అనే వ్యక్తి నిత్యం తన భార్యను వేధించేవాడు. దీంతో ఆమె బుచ్చిరెడ్డిపాళెంలోని తన సోదరి ఇంటికి వచ్చింది. కాగా నజీర్ అక్కడికీ వచ్చి భార్య సోదరితో వివాదానికి దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘరణ వాతావరణం నెలకొంది. ఎంతకీ వివాదం పరిష్కారం కాకపోవడంతో నజీర్ భార్య వెంటనే దిశ యాప్‌లో ఫిర్యాదు చేయగా కేవలం ఆరు నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు సమస్యను పరిష్కరించారు.

తల్లిపాలను మించిన ఔషధం లేదు

- డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(బారకాసు) : బిడ్డకు తల్లిపాలను మించిన ఔషధం లేదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మెటర్నిటీ విభాగంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగనున్నాయని, ఇందులో భాగంగా బిడ్డకు తల్లిపాలు ఎంత శ్రేష్టమో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఓ వరమని, వీటిని మించిన పౌష్టికాహారం లేదన్నారు. పోతపాల కంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా, వ్యాధుల్ని జయించే వారిగా ఉంటారనేది నిరూపితమైందన్నారు. గైనిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి అనేక లాభాలున్నాయన్నారు. తల్లులు చనుపాలు ఇవ్వడం వల్ల బర్భదారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారన్నారు. అంతేకాకుండా ఉబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుందని, గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారని చెప్పారు. బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భసంచి కేన్సర్లు రావన్నారు. తల్లులకు మలి వయసులో వచ్చే అస్టియో పొరొసిస్(ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుందని తెలియజేశారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి రోజుకు 8 నుంచి 10 సార్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కళారాణి, చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ జయచంద్రనాయుడు, గైనిక్ వైద్యులు రోజారమణి, స్నిక్తా, సుజాత, శివజ్యోతి, కావ్యశ్రీ, భవ్య, సోఫియా, తేజశ్వినిప్రియ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	123
లేయర్ (లైవ్)	88
బ్రాయిలర్ చికెన్	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	240
లేయర్ చికెన్	150



జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- ప్యాథలాజికల్ ఫ్రాక్చరైన 19 ఏళ్ల యువతికి సర్జరీ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో ఓ యువతికి అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నిప్పోసెంటర్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల పావని ఆడుకుంటూ పడిపోయింది. దీంతో ఆమె ఎడమ కాలి తొడ విరిగిపోయింది. వెంటనే పావనిని పలు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చూపించారు. ఓ కార్పొరేట్ హాస్పిటల్ ఆమెకు సర్జరీ చేసింది. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె నడవలేని స్థితికి చేరింది. చివరికి ఆమె తల్లిదండ్రులు జీజీహెచ్‌కు తీసుకొచ్చి ఆర్థోపెడిక్ విభాగంలో చూపించారు. అక్కడి వైద్యులు పావనికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి సర్జరీ చేయాలని నిర్ణయించారు. పావనికి ప్యాథలాజికల్ ఫ్రాక్చర్ అయిందని గుర్తించారు. యువతి తల్లిదండ్రుల అంగీకారం మేరకు పావనికి నెల క్రితం ఆర్థోపెడిక్ విభాగ వైద్య బృందం ఆపరేషన్ చేసింది. నెల పాటు యువతికి ఆస్పత్రిలోనే మెరుగైన వైద్య సేవలందించి నడిచే స్థితికి తీసుకొచ్చారు. దీంతో పావనిని వైద్యులు గురువారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ ఇలాంటి అరుదైన శస్త్రచికిత్సను కార్పొరేట్ హాస్పిటల్‌లో నిర్వహిస్తే రూ.లక్షల ఖర్చు అవుతుందని, అయితే జీజీహెచ్‌లో పూర్తి ఉచితంగా నిర్వహించి విజయవంతం చేశామన్నారు. ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ రవిశంకర్, ప్రొఫెసర్ చంద్రశేఖర్‌నాయుడు, వైద్యులు మధు, కిరణ్, భాస్కర్, దివ్య, గులాబీ సహకారంతో నాలుగు గంటల పాటు శ్రమించి పావనికి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించినట్లు తెలియజేశారు. అనంతరం పావని తండ్రి సురేష్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి డాక్టర్ కళారాణి పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేయించుకున్న పావనితో వైద్యాధికారులు, వైద్యులు

అనుమానాస్పద స్థితిలో డ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్) : లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శివగిరికాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. శివగిరికాలనీలో షేక్ ఖలీల్(52), అఫ్రీన్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రియాజుద్దీన్, సోహెల్, మైనుద్దీన్ సంతానం. ఖలీల్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 2వ తేదీ సాయంత్రం అఫ్రీన్ తన కుమారులతో కలిసి రొట్టెల పండగకు వెళ్లారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఖలీల్ భార్యకు ఫోన్ చేసి ఎప్పుడు వస్తారని ఆరాతీశారు. అయితే భర్తను కూడా దర్గాకు రమ్మని అఫ్రీన్ కోరినా ఖలీల్ వెళ్లలేదు. రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో అఫ్రీన్, కుమారులు దర్గా నుంచి ఇంటికి వచ్చారు. ఖలీల్ ఒంటిపై గాయాలు ఉండటంతో ఏం జరిగిందని వారు ప్రశ్నించగా గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారని చెప్పారు. ఎందుకు అని అడుగ్గా సరైన సమాధానం చెప్పలేదు. ఆస్పత్రికి వెళ్దామని కుటుంబసభ్యులు కోరినా రేపు వెళ్దామని చెప్పి ఖలీల్ నిద్రపోయారు. గురువారం కుటుంబసభ్యులు నిద్ర నుంచి లేచిచూడగా ఖలీల్ మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఖలీల్ మృతదేహం

బైక్‌ల ఢీ

- నలుగురికి గాయాలు

ఉదయగిరి : పట్టణ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద రెండు బైక్‌లు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి పట్టణానికి చెందిన న్యాయవాది మస్తాన్, కొండయ్య తమ విధుల్లో భాగంగా కోర్టుకు బైక్‌పై వెళ్తున్నారు. సీతారామపురానికి చెందిన సురేష్, రత్నం అనే వ్యక్తులు దుత్తలూరు వైపు నుంచి ఉదయగిరి వస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ విగ్రహం వద్దకు రాగానే రెండు బైక్‌లు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సమాచారం సేకరించారు.

విదేశీ సిగరెట్ల విక్రయాలపై దాడులు

- రూ.1.21 లక్షల విలువైన సిగరెట్లు సీజ్

నెల్లూరు(క్రైమ్) : విదేశీ సిగరెట్ల విక్రయాలపై విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా నగరంలోని పలు దుకాణాల్లో దాడులు చేశారు. రూ.1,21,400 విలువ చేసే సిగరెట్లను సీజ్ చేశారు. స్థానిక పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. నగరంలో విదేశీ సిగరెట్లు విక్రయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారించారు. బుధవారం రాత్రి నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, మద్రాసు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు ప్రత్యేక బృందాలుగా దాడులు చేశాయి. స్టోన్‌హౌస్‌పేటలోని పి.సుజిత్‌కుమార్, రేబాలవీధిలోని బి.సురేంద్రబాబుల దుకాణాల్లో రూ.90,450 విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలో విజయకుమార్‌కు చెందిన ప్రావిజన్ షాపుపై దాడి చేసి రూ.2 వేలు విలువచేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసులు నమోదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ ఖాదర్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి సిగరెట్లను సీజ్‌చేశారు.

మద్రాసు బస్టాండ్ సమీపంలో..

మద్రాసు బస్టాండు ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో సత్యనారాయణ, సుబ్బారావు, బి.వెంకటసుబ్బయ్యకు చెందిన దుకాణాలపై విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు చేశారు. రూ.18,525 విలువ చేసే వివిధ విదేశీ కంపెనీలకు చెందిన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మద్రాసు బస్టాండు సమీపంలోని ఎ.మహేంద్రకు చెందిన మహేంద్ర ఫ్యాన్సీ షాప్‌పై దాడి చేసి రూ.10,425 విలువచేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని రూరల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనాథ్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాధీనం చేసుకున్న సిగరెట్లను పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు నిందితులపై కేసులు నమోదుచేసి సిగరెట్లను సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

నల్లమందు పేలడంతో గేదెకు గాయాలు

చేజర్ల : భూమి లోపల పాతిపెట్టిన నల్లమందు పేలడంతో ఓ గేదె ప్రమాదానికి గురైన ఘటన మండలంలోని వావిలేరు సమీపంలో జరిగింది. వావిలేరు చెరువు సమీపంలోని అడవిలో ఓ గేదె మేతకు వెళ్తుండగా భూమి లోపల పాతిపెట్టిన నల్లమందు పేలింది. దీంతో గేదె ముఖం పూర్తిగా ఛిద్రమైంది. గత కొంత కాలంగా వేటగాళ్లు జీవాలను వేటాడేందుకు నల్లమందును భూమిలో పాతడం పరిపాటిగా మారింది. దీనివల్ల మూగజీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి.

పరిమిత సాగు మేలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : 2022–23 పొగాకు సీజన్‌లో రైతులకు అధిక ధరలు లభించడం చాలా సంతోషకరమని, అయితే వచ్చే సీజన్‌లో బోర్డు నిబంధనలు పాటించి పరిమితంగా సాగు చేయడం మేలు అని పొగాకు బోర్డు దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయాధికారి ఎం.లక్ష్మణరావు పేర్కొన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి వేలం కేంద్రంలో గురువారం పొగాకు వేలం సందర్భంగా రైతు సంక్షేమ సంఘం నేతలు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతర్జాతీయంగా కరోనాతో పాటు అనేక ప్రత్యేక పరిస్థితుల వల్ల పొగాకు పంట సాగు తగ్గిందని, ఈ కారణంగా మన ప్రాంత రైతులకు గిట్టుబాటు ధరలు దక్కాయన్నారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు ఏ విధంగా ఉంటాయో అంచనా వేయడం కష్టమని, రైతులు పొగాకు బోర్డు సూచనలకు అనుగుణంగా పంటసాగు చేసి లాభాలు పొందాలని సూచించారు. డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఇక్కడి కేంద్రంలో కిలో పొగాకు అత్యధికంగా రూ.270 నమోదైందని, గతేడాది కంటే సగటు ధర రూ.33 అధికంగా పెరిగిందన్నారు. అయితే రైతులు పంట పరిమితి పాటించాలన్నారు. అనంతరం పొగాకు బోర్డు ఉన్నతాధికారులు, సిబ్బంది, రైతు సంఘ నాయకులను పలువురు రైతులు సన్మానించారు. రైతు సంఘ నేతలు బాలవెంగళరెడ్డి, ఆరికట్ల జనార్దన్‌నాయుడు, దామా సుబ్బారావు, రాంబాబు, ఏనుగుల భాస్కర్‌రెడ్డి, మంతు యానాదిరెడ్డి, సుబ్బరాయుడు, రామిరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు

పాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు

- ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటేశ్వర్లు

నెల్లూరు(సెంట్రల్) : పాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల ఆరుగురు ఏజెంట్లు చేసిన పాల కల్తీపై నెల్లూరులోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం ప్రాంతంలో ఐదుగురు పాల సేకరణ ఏజెంట్లు, అదే మండలంలోని పందిపాడు ప్రాంతంలో మరో ఏజెంటు పాలను కల్తీ చేస్తున్నట్లు ఇటీవల గుర్తించామన్నారు. పాల శాంపిల్స్‌ను పరిశీలించగా ఫ్యాట్ ఎక్కువగా చూపించడానికి చక్కెరను కలుపుతున్నట్లు తెలిసిందని, పూర్తిగా పరిశీలిస్తే స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో ఆరుగురి ఏజెంట్లపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల అపరాధ రుసుం వేశామన్నారు. నగదు చెల్లించలేని పరిస్థితుల్లో వారికి సంబంధించిన ఆస్తులను చట్టం ప్రకారం వేలం వేస్తామన్నారు. ఫ్యాట్ శాతం పెరగడానికి కొన్నిచోట్ల చక్కెరతో పాటు, సన్‌ఫ్లవర్ ఆయిల్ కూడా మిక్స్ చేసి కలుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎక్కడైనా పాలను కల్తీ చేస్తే చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అపరాధ రుసుం వేస్తామన్నారు.



సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
Wanted an Accountant M/F (Junior & Senior)
for a leading Wholesale Jewellery Company in Nellore.
Graduate with Good Knowledge of Computer and Tally, MS Word, Excel essential. Well versed with all Tax formalities.
Good Scale for right candidates with better facilities.
Candidates May Walk in with their Resume to
03-08-2023 to 05-08-2023 Between 11.00 am to 2.00 pm
SRI KAMAKSHI JEWELLERS
Kakarlavari Street, Near Chinnabazaar, Nellore.
+91 94411 11201

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY & SCIENCES : TIRUPATI
(AUTONOMOUS)
Accredited by NAAC in "A" grade, Accredited by NBA, New Delhi
Renigunta (M), Tirupati - 517 520
Ph.No:9848930687. Website: www.aits-tpt.edu.in.
WANTED FACULTY
Applications are invited for Professor / Associate Professor/ Assistant Professor positions in the Departments of CSE/AI/Data Science/ Machine Learning, EEE, ECE, Civil, Mechanical Engineering, English, Mathematics, Physics, Chemistry, MCA, and MBA and can be sent to email ID: aitstpt@gmail.com on or before 11.08.2023. Higher start of pay will be offered in respect of deserving candidates. Programmers: Any Degree holder with PGDCA/BCA/MCA or equivalent, having good programming skills. For Technicians in CE, ME, EEE & ECE: Diploma in related discipline or B.Tech is the eligibility.
Date: 03.08.2023 Sd/- PRINCIPAL

సాక్షి క్లాసిఫైడ్స్

BIRTHDAY GREETINGS



EDUCATION
■ డైరెక్ట్ 10th, ఒకే సం॥లో ఇంటర్, B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Com, MA, MLisc, BCA, BSc, BCom, BA, BLisc, Health & Sanitary Course @ 80080 10144. [NA-5203]

CHANGE OF NAME
I, INDURU THANUGNA (Old Name) Resident of D.No.16-8-237, Ramalingapuram, Near Jagan College, Nellore-524003, SPSR Nellore dt, AP. Here by declare that I have Changed my name as INDURU THANUGNA REDDY (New Name) D/o.INDURU MAHIDHAR KUMAR REDDY

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629 [T-4471]
■ Direct Final Year :- BA / B.Com / B.Sc / BBA / BCA / MA / M.Sc / MBA / MCA / Diploma / B.Tech / M.Tech / (Discountinued). Contact : 99481 59688. [NA-5211]

REAL ESTATE
BUILDING CONSTRUCTION
■ కార్తికేయ కన్‌స్ట్రక్షన్స్ బిల్డర్స్ మెటీరియల్ కాంట్రాక్ట్ పద్ధతిలో ఇండివిడ్యువల్ హౌసెస్, అపార్ట్‌మెంట్స్ కట్టించి ఇవ్వబడును. సంప్ర: 70759 14940, 79974 37997. [NA-7061]

HOUSE FOR SALE
■ నెల్లూరు నుండి 8km దూరంలో మైపాడు రోడ్డుకు ఇండిపెండెంట్ 1BHK 29,90,000 రేటుకు, ఇండిపెండెంట్ 2BHK 34,90,000కు అమ్మబడును. సెల్: 63004 37419. [NA-7063]

LAND FOR SALE
■ ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. ఫామ్‌హౌస్‌కి అనుకూలం. వివరాలకు సంప్రదించండి: 70862 31356. [NA-7057]
■ నెల్లూరు జిల్లా, కలువాయి మండలము చింతలాత్మకూరు, చీపినాపి గ్రామంలో వ్యవసాయానికి అనుకూలమైన 40 ఎకరముల పొలం అమ్మబడును. సెల్: 99852 45725. [NA-11274]

PLOT FOR SALE
■ నెల్లూరు నవాబుపేట, అల్లీపురం రోడ్డులో అంకణం రూ.1 లక్ష 35 వేల నుండి, సిమెంట్ రోడ్లు, ఎలక్ట్రిసిటీ, ఇళ్ళ మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 90000 75785. [NA-10892]

SERVICES
GOLDFINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.స్పాట్‌క్యాష్ ✆ 99121 05656 [B-379]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781997]

CHANGE OF NAME
I, INDURU THANUGNA REDDY D/o. INDURU DIVYA MANJEERA (Old Name) (Pasport No: M3146681) Resident of D.No.16-8-237, Ramalingapuram, Near Jagan College, Nellore-524003, SPSR Nellore dt, AP. Here by declare that I have Changed my Mother's name as INDURU DIVYA MANJEERA REDDY (New Name)

TOURS & TRAVELS
■ కార్తీకపౌర్ణమి సందర్భంగా కాశీయాత్ర 22-11-2023, ద॥పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాల్,అలహాబాద్, సీతామఢి, 9రోజులు టి॥ ఒక్కంటికి 10500. STట్రావెల్స్. 9885853240 [G-7473]

WANTED
■ Wanted Experience Teachers to Teach VIIth to Xth Classess. Salary : 25,000. Cont:8499816075, 99664 51182. [NA-5807]
■ Wanted Teachers to Teach Play Class, LKG & UKG Classes. Salary : 10,000. Cont:9966451182, 8499816075. [NA-5808]

CHANGE OF NAME
I, INDURU DIVYA MANJEERA (Old Name) Resident of D.No.16-8-237, Ramalingapuram, Near Jagan College, Nellore-524003, SPSR Nellore dt, AP. Here by declare that I have Changed my name as INDURU DIVYA MANJEERA REDDY (New Name) D/o.INDURU THANUNGA REDDY

■ e-Bikes (Part time, Full time) Marketing Executive గా పని చేయుటకు కావలెను. Salary : 50k. Cont : ADMS, Gandhinagar, Vedayapalem. Nellore. Ph: 98493 60048. [NA-10887]
■ Need Experience Civil / Construction Supervisors 2 to years Experiences and Also Have Knowledge in Marketing M/F with Attractive Salary. Send Resume to mkgunji@gmail.com. Cont : 99084 85939. [N-1205852]
■ Wanted Male Marketing Incharge to Work in Master Minds Junior College who have Experience in Marketing will be Given Preferable. Location: Nellore, Qualification: Any Degree, Age: 25 to 45. Salary upto : 25k. Contact: 92487 33309 [G-4517]
■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. 88854 86421. [M-1221477]
■ కార్పోరేట్ రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ ఏజెంట్‌లు కావలెను. వివరాలకు సంప్రదించండి : 99492 11140. [NA-5806]
■ అకౌంటెంట్ కావలెను : నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ రోడ్‌లోని కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేయుటకు ట్యాలీలో అనుభవం గల అకౌంటెంట్ కావలెను. అనుభవాన్ని బట్టి మంచి జీతం. 96207 01899. [NA-10393]
■ సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్, సూపర్‌వైజర్స్, గార్డ్‌లు (M/F), లేడీ వార్డెన్స్ మహాలక్ష్మీపురంలోకి 10th చదివిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. 90102 14397, 99510 72170. [N-785352]
■ కావలెను. హెల్పర్స్ (మగవారు) 10 no's కావలెను. శ్రీ దుర్గా ఫుడ్స్, 3వ మైలు రోడ్డు, నవలాకుల గార్డెన్, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి : 95050 79107, 85550 54218. [NA-5204]
■ అనుభవం కలిగిన మిషన్ ఆపరేటర్స్ కావలెను. శ్రీ దుర్గా ఫుడ్స్, 3వ మైలు రోడ్డు, నవలాకుల గార్డెన్, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి. సెల్: 85550 54218. [NA-5206]
■ సేల్స్‌మెన్స్ 5 no's కావలెను. మరియు APE గూడ్స్ ఆటో డ్రైవర్లు 4 no's (అనుభవం, లైసెన్సు కలవారు) కావలెను. శ్రీ దుర్గా ఫుడ్స్. వివరాలకు సంప్రదించండి: 95437 58005. [NA-5207]
■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221503]

CHANGE OF NAME
I, SHAIK KARISHMA D/o. SHAIK SHARIFA BEE (Old Name) (Passport No:T2397569) Resident of 50036, Police Quarters, Opp. Sunny Heights Hotel, Nellore Town, SPSR Nellore dt, AP. Here by declare that I have Changed my Mother's name as SHAIK SHAREEFA BEE (New name)

■ ముత్తుకూరు ప్రవంతి హోటల్ (AC)లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, సప్లయర్స్, రూమ్ బోయ్స్ కావలెను. మంచి జీతం + రూమ్ + ఫుడ్ కలదు. ఫోన్ : 83099 15445, 94903 19998 [V-6205]
■ నెల్లూరు గూడూరులోని మున్సిపాలిటీ డంప్ యార్డ్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ 12 వేల జీతం+ ESI, PF సంప్ర: 72879 17477, 91829 64173 [L-787398]
■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీసు అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్లు. అర్హత: 10th–డిగ్రీ, జీతం: 25000/– సంప్ర : 96422 52949. [G-7472]

CHANGE OF NAME
I, KOLAPARTHI NIHARIKA D/o KOLAPARTHI SURYANARAYANA (Old Name) resident of D.No.18-259, Adhyaksham Vari Street, Near Kanthi Stores, Chinna Bazar, Nellore, SPSR Nellore Dt.(A.P) do hereby change my name as KOTA LAKSHMI NIHARIKA W/o KOTA VENKATA SAI ANEESH (New Name)

■ హరిక్రిష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ:18k హైదరాబాద్: 9640258899, విజయవాడ: 9640648899. [HA-476]
■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 12000 - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 89196 13984. [HA-477]
■ నెల్లూరు జిల్లాలో మండలాల వారీగా Real Estate & Agro Products మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్స్, Govt. Rtd People కావలెను. Salary + PF + Commission. Cont: 98858 44445. [NA-5800]
■ లేడీ నర్సులు కావలెను :- అర్హత : GNM / B.Sc Nursing with 1 year Experience. సంప్రదించండి : డా॥ అండాల్ భాస్కర్, పొగతోట, S2 సినిమా హాలు ఎదురుగా, నెల్లూరు. ఫోన్:0861–2328914, 99088 54316. [NA-2530]
■ లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. Qlf: Any Degree with Computer Knowledge. లేడీ కౌన్సిలర్ కావలెను. Qlf: Degree with Computer Knowledge&Communication Skills. Cont: Dr. S.Andal Bhaskar Lakshmi Fertility Centre,Near S2 Cinema Hall, Pogathota, Nellore. 99088 54316, 0861-2328914. [NA-2530]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

సాక్షి క్లాసిఫైడ్స్‌కు సంప్రదించండి
నాలుగు లైన్లకు ₹ 320/-
అదనపు లైనుకు ₹80/-
కలర్ ప్రకటనకు 25% అదనం
నెల్లూరు
90 1000 66 11